

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 07 | సంచిక 195 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం 15, జూన్ 2026 | పేజీలు 4 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్





# జోకుడుకు మరిగిన జర్నలిజం!



## కలంపై "కసాయి కీచకుల" దాడులు.




డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

జర్నలిజం అనేది సాధారణమైన వృత్తి కాదని సమాజాన్ని ప్రభావితం చేసే మహోన్నతమైన శక్తి అంటూ డాక్టర్ బరిగెల శివ అభివర్ణించారు.సాహసవంతమైన జర్నలిజం చేయకపోతే సమాజంలో పలుచన అవుతామన్న సంగతిని ప్రతి జర్నలిస్టు గుర్తుకు పెట్టుకోవాలని సూచించారు.జర్నలిజాన్ని జర్నలిజం లాగా ప్రభావితం చేసే క్రమంలో మనవాడెవడో పరాయివాడెవడో పసిగడ్డ లేని పరిస్థితిలో నేటి జర్నలిస్టుల ప్రయాణం కొనసాగుతుందని జర్నలిజంలో కేటుగాళ్లంతా బయట నుండి చేరిపోతున్న బాపతు గాళ్లేనంటూ అలాంటి వాళ్లను గుర్తిస్తూ జర్నలిస్టులు ముందుకు

- మిగతా 2లో..

జర్నలిజంలో ఆత్మగౌరవ పోరాటం ఎక్కడ.
మోసగాళ్లపై మనదైన పదునెక్కడ.
దేశంలో జరుగుతున్న ఆర్థిక దోపిడీని ప్రశ్నించండి.
పదునైన మీడియా దారులు బహుజనులే.
సమాజాన్ని ప్రభావితం చేయగల జర్నలిజాన్ని చూడగలమా.
ఆధునిక కాలంలో అంతరించిపోతున్న జర్నలిజం విలువలు.
నిజాయితీ గల జర్నలిస్టులకు నిలువెత్తు గర్వం ఉంటుంది.
కేటుగాళ్లంతా జర్నలిజం ముసుగేసుకుంటున్నారు.
జర్నలిస్టులం ప్రభుత్వాల దృష్టిలో ఎందుకు పలుచనవుతున్నాం.
సూటి పోటీ దాడుల ముసుగులో జాడ లేకుండా పోతున్నామా.!
నిజాన్ని నిర్భయంగా చాటి చెప్పడానికి అడ్డంకులు ఎందుకు.
మంచిని చెడును సమానంగా చూస్తే జర్నలిజం ఎలా అవుతుంది.
జర్నలిజంలో విశ్వాసఘాతకులంతా బయటివాళ్లే.
అరాచక శక్తుల "కీచక" ఆగడాలపై పోరాటాలు చేద్దాం.
డాక్టర్ బరిగెల శివ.

## అధికారులపై సీఎం రేవంత్ ఫైర్

అవసరమైతే నేనూ రోడ్లపైకి వస్తా!
వర్షాలపై అధికారులతో
సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష
అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం
అవసరమైతే తానూ రోడ్లపైకి వస్తానని వెల్లడి
నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

2



## భూములిచ్చిన రైతులే తొలి విమానంలో ప్రయాణికులు..

నోయిడా ఎయిర్‌పోర్ట్‌లో చారిత్రక ఘట్టం
నోయిడా విమానాశ్రయం నుంచి తొలి విమాన సర్వీసు ప్రారంభం
భూములు ఇచ్చిన రైతులనే మొదటి ప్రయాణికులుగా పంపనున్న ప్రభుత్వం
సోమవారం ఉదయం 8 గంటలకు లక్నోకు ఈ విమానం ప్రయాణం
లక్నోలో రైతులతో ముచ్చటించనున్న సీఎం యోగి ఆదిత్యనాథ్
ఇది చరిత్రాత్మక ఘట్టమని జేవార్ ఎమ్మెల్యే వ్యాఖ్య




2

## ప్రతిభ గల పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందజేసిన విజయ్ దేవరకొండ

4

## మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచింది రేవంత్ రెడ్డే: కేటీఆర్

మీనాక్షి నటరాజన్‌పై రేవంత్ కుట్ర అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు
ఆమెకు రాజ్యసభ సీటు రాకుండా బీజేపీతో రేవంత్ కుమ్మక్కయ్యారని ఆరోపణ
కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శలు
ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక రావడం ఖాయమని జోస్యం
ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపు



4




## ఆ కమిటీపై చర్యలు ఎక్కడ

మంచాల సదానందంను కాపాడుతున్నది ఎవరు.
కమిటీ వేసి రెండు సంవత్సరాలు దాటుతున్న చర్యలు శూన్యం
ఇప్పటికే సదానందంపై చర్యలకు ఈసీ ఆమోదించింది
ప్రభుత్వం పేరు చెప్పి కాలయాపన చేస్తే ఎలా
అకుట్ ప్రెసిడెంట్ కు దగ్గరైతే అవినీతికి తిరుగుండదా
మంచాల సదానందంపై చర్యలకు ఎందుకు ఉపక్రమిస్తున్నారు
కంప్యూటర్ల అవినీతి కనుమరుగైనట్లేనా
కేయూ ఇంజనీరింగ్ వ్యవస్థను నాశనం చేసింది అప్పుడే మర్చిపోయారా
ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న కేయూ ఇంజనీరింగ్ వ్యవస్థ

3

# భూములిచ్చిన రైతులే తొలి విమానంలో ప్రయాణికులు..

నోయిడా ఎయిర్‌పోర్ట్‌లో చారిత్రక ఘట్టం
నోయిడా విమానాశ్రయం నుంచి తొలి విమాన సర్వీసు ప్రారంభం
భూములు ఇచ్చిన రైతులనే మొదటి ప్రయాణికులుగా పంపనున్న ప్రభుత్వం
సోమవారం ఉదయం 8 గంటలకు లక్నోకు ఈ విమానం ప్రయాణం
లక్నోలో రైతులతో ముచ్చటించనున్న సీఎం యోగి ఆదిత్యనాథ్
ఇది చరిత్రాత్మక ఘట్టమని జేవార్ ఎమ్మెల్యే వ్యాఖ్య





**ఢిల్లీ, జై భీమ్ న్యూస్**

ఉత్తరప్రదేశ్‌లో నూతనంగా నిర్మించిన నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం తమ వేలాది ఎకరాల భూములను త్యాగం చేసిన రైతులే ఈ విమానాశ్రయం నుంచి బయలుదేరే తొలి విమానంలో ప్రయాణించనున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు నోయిడాలోని జేవార్ నుంచి లక్నోకు ఈ విమానం బయలుదేరనుంది. ఈ చారిత్రక విమాన ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా జేవార్ ఎమ్మెల్యే ధీరేంద్ర సింగ్ మాట్లాడుతూ, "బహుశా చరిత్రలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. విమానాశ్రయం కోసం భూములు ఇచ్చిన రైతులే అందులోంచి బయలుదేరే తొలి విమానంలో ప్రయాణికులు కాబోతున్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దార్శనికతతో రైతుల కలలు నెరవేరాయి" అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం భూములు ఇచ్చిన రైతులతో కలిసి తాను కూడా ఈ విమానంలో ప్రయాణిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణిస్తున్న రైతులలో మహిళలు, భూమి ఇవ్వకపోయినా విమానాశ్రయ నిర్మాణం వల్ల నిర్వాసితులైన వారు కూడా ఉన్నారని ఎమ్మెల్యే వివరించారు. లక్నో చేరుకున్న తర్వాత ఈ రైతులందరూ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో ముచ్చటిస్తారు. "సామాన్యుడు కూడా విమానమెక్కాలన్నది ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం యోగి ఆదిత్యనాథ్ కల. అది రేపు జేవార్ నుంచి నెరవేరబోతోంది" అని ధీరేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 28న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. 'వికసిత ఉత్తరప్రదేశ్'కు ఈ విమానాశ్రయం ఒక చిహ్నంగా నిలుస్తుందని ఆనాడు ప్రధాని వ్యాఖ్యానించారు.

# అధికారులపై సీఎం రేవంత్ ఫైర్

అవసరమైతే నేనూ రోడ్లపైకి వస్తా!
వర్షాలపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష
అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం
అవసరమైతే తానూ రోడ్లపైకి వస్తానని వెల్లడి
నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక






**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, ప్రకృతి విపత్తుల నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అధికారులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించుకోవాలని ఆయన ఆదేశించారు. జూన్ 1న నిర్వహించిన సమీక్షలో ముందస్తు సూచనలు జారీ చేసినప్పటికీ, జూన్ 9న కురిసిన వర్షం సమయంలో అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించారని, శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాలు కురిసే సమయంలో జీహెచ్ఎంసీ, పోలీస్, ట్రాఫిక్, విద్యుత్ శాఖల ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ రోడ్లపైనే ఉండి విధులను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. "అవసరమైతే నేనూ స్వయంగా క్షేత్రస్థాయిలోకి వస్తాను. ట్రాఫిక్ సమస్యలు లేదా వరదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని" ఆయన హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో, ఈ సమీక్షా సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# జోకుడుకు మరిగిన జర్నలిజం !




మొదటి పేజీ తరువాయి

సాగాలని పిలుపునిచ్చారు.ఎక్కడైతే అణిచివేత మొదలవుతుందో ఎక్కడైతే అరాచకాలు సృష్టించబడతాయో ఎక్కడైతే ప్రజలు ఎక్కువగా అవమానాలను ఎదుర్కొంటారో ఎక్కడైతే క్షేత్రస్థాయి అవినీతి జరుగుతుందో ఎక్కడైతే కేటుగాళ్లంతా ముఠాలుగా ఒక్కటై వ్యవస్థలను దోచుకుంటారో అలాంటి వాళ్లపై పోరాటాలు కొనసాగిస్తున్న జర్నలిస్టులు అందరూ ధైర్య సాహసాలతో ముందుకు సాగాలని కోరారు.కేటుగాళ్ల ముఠాలు వాళ్లపై చేయుచున్న పోరాటాల్లో మనకన్నా ఎక్కువ వాళ్లే జర్నలిస్ట్ ముసుగు వేసుకొని సమాజాన్ని తప్పుదోవ పట్టించే క్రమంలో ఆస్తులు సంపాదించుకుంటూ అధికారం సంపాదించుకుంటూ సమాజాన్ని మోసం చేస్తూ వ్యవస్థలను వెక్కిరింతల పాలు చేస్తూ నాణ్యతలేని వ్యక్తులుగా నామరూపం లేని శక్తులుగా వెలుగొందుతూ వాళ్లకు వాళ్లే గొప్పోల్ల లాగా సొంత పత్రికలు సొంత టీవీలు పెట్టుకుంటూ బినామిదందాకు బందుత్వాన్ని పెంచి పోషిస్తున్నారని గుర్తు చేశారు.నిజం కోసం పోరాడేవాళ్లు ఆస్తుల సంపాదన పట్ల ఆరాటపడరని కేవలం కుటుంబ పోషణ గడిస్తే సరిపోతుందని జీవిత లక్ష్యాలను జర్నలిజంలో ప్రదర్శిస్తూ సమాజంలో అతికరుడుగట్టిన నిజమైన జర్నలిస్టులుగా ఎదుగుతారన్నది గుర్తుంచుకోవాలన్నారు.అదే సందర్భంలో కసాయి గాళ్లు కూడా జర్నలిస్టులమంటూ అవినీతి ముసుగును ధరించి జర్నలిజాన్ని ముఖంపై వేసుకొని రాళ్ళేమైనా తక్కువ అంటూ ముందుకు దూసుకు వస్తారంటూ గుర్తు చేశారు.నిజమైన జర్నలిస్టులు నిజమేదో అబద్ధం ఏదో పసిగట్టలేని దుర్మార్గమైన స్థితిలో వార్తలు రాయడం టీవీలలో ప్రసారాలు చేయడం దేనికోసం అంటూ సమాజం ప్రశ్నించడాన్ని ఇంకా గుర్తించకపోవడం బాధాకరమన్నారు.ప్రస్తుత జర్నలిజంలో15 నుండి 20 సంవత్సరాల పైబడి జర్నలిజంలో కొనసాగుతున్న సీనియర్ జర్నలిస్టులు నీతి నిజాయితీ నియమాలతో ముందుకు సాగుతున్నారని కొత్తగా వచ్చిన జర్నలిస్టులు కేవలం కేటుగాళ్లను బ్రోకర్ గాళ్లను కసాయికాలను అవినీతిపరులను భూకబ్జాదారులను అక్రమార్కులను వ్యవస్థ నాశనదారులను సమాజ వ్యతిరేక శక్తులను సంఘవిద్రోహశక్తులను రక్షించడం కోసం వాళ్లకు సహకరించడం కోసం మాత్రమే జర్నలిజం ముసుగు వేసుకుంటున్నారని అలాంటి వాళ్ళతో సమాజానికి చాలా ప్రమాదం పొంచి ఉందన్న సంగతిని మర్చిపోవద్దన్నారు.జర్నలిజం అంటే అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాలని,జర్నలిజం అంటే అక్రమార్కులు జడుచుకోవాలని, జర్నలిజం అంటే కేటుగాళ్లంతా కళ్ళు తెరుచుకోవాలని,జర్నలిజం అంటే కసాయి గాళ్లు జడుచుకోవాలని,జర్నలిజం అంటే అన్ని ప్రభుత్వ శాఖల లోని అవినీతి అక్రమార్క అధికారులకు వణుకు పుట్టాలని,జర్నలిజం అంటే రాజకీయ నాయకులు తప్పు చేయాలంటే భయపడాలని,ప్రజలను మోసగించాలంటే జర్నలిస్టులు వెంటాడుతారనే భయాన్ని పుట్టించాలని గుర్తు చేస్తూ నిజమైన జర్నలిజాన్ని మనస్ఫూర్తిగా ప్రభావితం చేయగలిగినప్పుడు మన వ్యక్తిగత ఆత్మగౌరవమే కాకుండా తప్పు చేసిన వాడు ఎవడైనా గజగజ వణికిపోయే స్థితికి లోనవుతారన్నది వాస్తవమన్నారు.నిజాయితీ కలిగిన జర్నలిస్టులపై మానసిక శారీరక ఆర్థిక దాడులు విపరీతంగా పెరిగిపోవడానికి ప్రధాన కారణం వ్యవస్థలను దోచుకుంటూ వ్యవస్థలను అభాసపాలు చేస్తూ అవినీతి సామ్రాజ్య స్థాపకులు అంతా చిల్లర గుంపులుగా జమై సమాజాన్ని నిజమైన జర్నలిస్టుల ఉనికి లేకుండా చేస్తున్నారని అలాంటి వాళ్లను శిక్షించాల్సిన ప్రభుత్వాలు పోలీస్ వ్యవస్థలు అధికార ముసుగులో ప్రభుత్వ వ్యవస్థలకు అడ్డంకులు వస్తాయేమోనని ఇబ్బందికరంగా వ్యవహరిస్తూ వాళ్లకు అన్ని రకాల మినహాయింపులు కల్పిస్తుండడం వల్లనే నిజమైన జర్నలిజంపై నిలువెత్తు మానసిక దాడులు జరుగుతున్నాయని హెచ్చరించారు.ప్రభుత్వాలు గానీ పోలీస్ అధికారులు గాని జర్నలిజంలో విశ్వాసఘాతకులంతా బయటి వాళ్లేనని ఎందుకు గుర్తించలేకపోతున్నారంటూ గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిజమైన జర్నలిస్టులకు గౌరవప్రదమైన హోదాను కల్పించడానికి సంసిద్ధమై ఉంటుండగా రాష్ట్రవ్యాప్తంగా కొంతమంది నకిలీ ఉద్యోగులు కొంతమంది నకిలీ అధికారులు కొంతమంది నకిలీ వ్యాపారులు కొంతమంది నకిలీ భూకబ్జాదారులు కొంతమంది రహస్యంగా పత్రిక మీడియా నడిపిస్తున్న "కీచకులు" నిజమైన జర్నలిజాన్ని శాసించాలని దుబారా అవస్తులోనికి జర్నలిజాన్ని నెట్టివేయాలని తీవ్రమైన కుట్రలు కుతంత్రాలు కుయుక్తులు పన్నుతున్నారని వాళ్లందరినీ సమాజ ద్రోహులుగా సమాజంలో కిరాతక శక్తులుగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు.తినడానికి తిండి లేని స్థితిలో నుండి ఇంచుమించు 100 కోట్ల వరకు సంపాదించిన నకిలీ ముసుగుదారులను పసిగట్టలేని ప్రభుత్వాలు అవినీతి సామ్రాజ్యదారుల కుట్రాల్లో ప్రభుత్వ వ్యవస్థలను వదిలేస్తున్నట్లుగా ఉందన్నారు.

## జర్నలిజంలో వక్రమార్గం వంకర బుద్ధి..

దినదినానికి దిగజారిపోతున్న జర్నలిజం విలువలను కాపాడుకోవాలంటే ముందస్తుగా సోషల్ మీడియా గ్రూపులలో వాట్సప్ గ్రూపులలో ప్రభుత్వ ఉద్యోగులుగా చలామణి అవుతూ సమాజంలో రాజకీయ నాయకులుగా చలామణి అవుతూ తప్పుడు పోస్టులను తప్పుడు వీడియోలను వాళ్ళ వాళ్ళ సొంత నెంబర్లతో పాటు నకిలీ ఫోన్ నెంబర్లను సృష్టించుకుని సమాజాన్ని అధోగతి పాలు చేయడానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తున్న కీచకులను పసిగట్టకపోతే అసలైన వంకర బుద్ధి కలిగిన నకిలీ గాళ్లు బయటకు రావడం కష్టతరంగా మారిపోతుందన్నారు.సమాజాన్ని సర్వనాశనం చేయాలని సమాలోచనలు చేస్తున్న నకిలీ ముఠాలతో రహస్య సంబంధాలు రహస్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్న వ్యక్తులు జర్నలిజం వైపు అడుగులు వేస్తున్నారని అలాంటి నకిలీ ముఠాల కోసం జర్నలిజం చేయడం సిగ్గుచేటు అన్నారు.నిజమైన జర్నలిజాన్ని చూసి అవినీతిపరుడు 100 మీటర్ల దూరంలో జడుచుకోవాలని అలాంటి జర్నలిజాన్ని కొనసాగించడానికి ఎలాంటి సాహసం అవసరం లేదని కేవలం నిజాయితీగా నిజాన్ని నమ్ముకుని సామాన్య జర్నలిజం చేస్తే అదే మనల్ని ఎంతో ఉన్నతమైన భావాలతో కలిగిన వ్యక్తులంగా సమాజంలో ప్రభావితం చేస్తుందని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.నేటి జర్నలిజంలో ఒక్క అవినీతిపరుడు 100 మంది జర్నలిస్టులను గుప్పిట్లో పెట్టుకునే స్థాయికి జర్నలిజం వ్యవస్థ దిగజారి పోతుందని ఒక్క రాజకీయ నాయకుడు వంద మంది జర్నలిస్టులను తన ఇండ్ల చుట్టూ తిప్పుకునే పరిస్థితికి చేరువవుతుందని ఒక ప్రభుత్వ అధికారి జర్నలిస్టులను ప్రలోభాలకు గురిచేస్తూ వాళ్ల అసాంఘిక కార్యకలాపాల నుండి తప్పించుకు తిరుగుతున్నారని గుర్తు చేశారు.అవినీతిని అంతమొందిస్తూ అధికార అరాచక శక్తులను నిలదీస్తూ ఉన్నతమైన భావాలతో జర్నలిజం చేయగల నిజమైన జర్నలిస్టుల కోసం సమాజం జల్లెడ పడుతుందని అలాంటి జర్నలిస్టులు అరుదుగా ఉంటారని వాళ్ళందరూ సమాజంలో నిలదొక్కుకోవడానికి క్లిష్టతరమైన కష్టతరమైన బాధాకరమైన మనోవేదనతో కూడిన దాడులను ఎదుర్కొంటూనే ఉంటున్నారని గుర్తు చేశారు.ఆదర్శవంతమైన జర్నలిజం ఎవరికి భయపడదని ఎవరికి తలొగ్గదని ఎవరికి లొంగదన్న సంగతిని నిరూపించగలగాలంటే నిజాన్ని నిర్భయంగా రాయగలిగినప్పుడే, దానినిచూపించగలిగినప్పుడే జర్నలిజం విలువలు బ్రతికి ఉంటాయని గుర్తు చేశారు.నాయకులను జోకుడు,అధికారులను మెచ్చుకొనుడు,ప్రజా ప్రతినిధుల సొంత మీడియాలో పనిచేస్తూ కేవలం వాళ్ళ రాజకీయ వ్యవస్థను వాళ్ళ ఆర్థిక వ్యవస్థను కాపాడడం కోసం మాత్రమే జర్నలిజాన్ని కొనసాగిస్తున్న జర్నలిస్టులు ఎంతో మంది ఉన్నారని అలాంటి వాళ్ళదే జర్నలిజంలో పైచేయిగా నడుస్తుందన్నారు.సమాజంలో సోషల్ మీడియా గ్రూపులను వాట్సాప్ గ్రూపులను నిర్మించుకుంటూ నిజమైన సమాచారాన్ని వాస్తవమైన విషయాలను నిర్బంధిస్తూ అరాచక శక్తుల రూపంలో అక్రమాలను అవినీతిని అసాంఘిక శక్తుల రూపాన్ని బయటపెడుతున్న వ్యక్తులను,శక్తులను, కీచకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## అవినీతి ముసుగులో అరాచకచక్తులు..


ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికార హోదాలో కొనసాగుతున్న వ్యక్తులందరూ వాళ్ళ అధికార హోదాలలో పెద్ద ఎత్తున అవినీతి మూసుగును ధరించి నిజాయితీపరులుగా చలామణి కావడం కోసం వ్యక్తిగత సోషల్ మీడియాను వ్యక్తిగత వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేసుకుని కొంతమంది జర్నలిస్టులతో వ్యక్తిగతమైన సన్నిహిత సంబంధం కలుపుకొని అధికార కార్యాలయాల్లో అరాచక శక్తులుగా చలామణి అవుతున్నారని వాళ్ళందరినీ కఠినంగా శిక్షించాల్సిన ప్రభుత్వాలు మౌన ప్రదర్శనకు దిగుతున్నాయని తీవ్రంగా దుయ్యపడ్డారు.ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి ఎంత స్మార్ట్ గా కొనసాగుతుందో తెలియజేయడానికి చక్కని ఉదాహరణగా అవినీతిపరులే అధికార హోదాలలో కొనసాగుతూ ప్రభుత్వ వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తుంటే నిజాయితీపరులైన వ్యక్తులు గాని నిజాయితీపరులైన అధికారులు గాని నిజాయితీపరులైన పోలీసులు గాని నిజాయితీపరులైన జర్నలిస్టులు గాని వాళ్ళ అధికార హోదా ముందు ప్రభావం చూపించలేకపోతున్నారన్నది గమనించదగ్గ విషయం అన్నారు.అంతేకాకుండా అలా అధికార హోదాలో అక్రమంగా కొనసాగుతున్న అరాచక శక్తులకు రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తూ ప్రభుత్వ అధికార హోదాల్లో కొనసాగించబడుతున్న కార్యక్రమాలలో గాని సమావేశాలలో గాని ముఖ్యమైన సందర్భాల్లో గాని అలాంటి అరాచక శక్తులచే సమాజానికి సందేశాలు ఇప్పించేస్తూ వాళ్ళనే పక్కన కూర్చోబెట్టుకొని మాట్లాడుతుండడం సమాజంలో అరాచక శక్తుల బలం పెరిగినట్లుగా కనబడుతుంది అన్నారు.ఇంటి దొంగతో ప్రాణగండం అన్నట్లు ప్రభుత్వ వ్యవస్థలో పనిచేస్తున్న కీచకులతో నకిలీ అరాచక శక్తులతో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వ వ్యవస్థలకు తీవ్రమైన ప్రమాదం పొంచి ఉందని ఏ ఒక్కరూ పసిగట్టలేక పోతుండడం ప్రభుత్వాల వైఫల్యం అన్నారు.తెలుగు రాష్ట్రాల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావస్తుండగా ఎక్కడ కనబడని దోపిడీ అంతా ఒక్కసారిగా విద్యా వ్యవస్థ వైపు మళ్ళి పోతుందని అంతేకాకుండా ప్రభుత్వ విద్యా వ్యవస్థలలో నిధుల సమీకరణ కోసం జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగా విద్యా వ్యవస్థలో పాతుకుపోయిన అరాచక శక్తులు అవినీతి శక్తులుగా అసాంఘిక శక్తులు కరుడుగట్టిన కీచక శక్తులుగా మారిపోయి ఉన్నత అధికారులను బెదిరించుకుంటూ భయపెట్టించుకుంటూ దవాయించుకుంటూ నకిలీ జర్నలిజం ముసుగులో అవినీతి రాబందుల్లా తయారై ప్రభుత్వ ఆర్థిక నిధులను గండి కొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని హెచ్చరించారు.రాజకీయ నాయకుల ఆగడాలను సామాన్యులను వేధిస్తున్న పోకడలను ప్రజాస్వామ్య వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్న విధానాలను అరాచక శక్తుల రూపంలో ప్రభుత్వ అధికార హోదాలను ఉపయోగించుకొని దౌర్జన్యాలకు పాల్పడుతున్న అధికారులను,స్థిరాస్తుల సంపాదన కోసం,స్థిరాస్తుల సంపాదన రక్షణ కోసం మీడియాలను నిర్మించుకొని, దౌర్జన్యాలను సృష్టిస్తూ,నిరంతరం బెదిరిస్తూ సమాజాన్ని అవహేళన చేసే శక్తులను ఎదిరిస్తూ ముక్కు సూటి జర్నలిజాన్ని ప్రదర్శిస్తూ నిలబలగల నిజమైన జర్నలిజం నిరదొక్కుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాం అన్నారు.అత్యంత దురాశ అత్యంత దుర్బుద్ధి కలిగిన వ్యక్తులు అధికార హోదాలో అవినీతి అక్రమాలకు పాల్పడి అసాంఘిక శక్తుల హోదాను బలపరుచుకొని జర్నలిజాన్ని అణిచివేస్తున్నారని నిజమైన జర్నలిజం కన్నెర్రజేస్తే ఎంతటి కసాయి శక్తులైన ఎంతటి అరాచక శక్తులైనా ఎంతటి కీచక శక్తులైన కనుమరుగైపోక తప్పదన్నది పసిగడుతూ గుర్తించాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు.రానున్న కాలంలో సమాజం చాలా ప్రమాదకరమైన స్థితిలోనికి నెట్టివేయబడబోతుందని గమనిస్తూ, గుర్తిస్తూ జర్నలిజం విలువలని జర్నలిజాన్ని బతికించుకోవడం కోసం అరాచక శక్తులు ఆగడాలను బయటపెడుతూ అవినీతిపరుల భరతం పడుతూ జర్నలిజాన్ని అణిచివేయాలని ప్రయత్నం చేసే అసాంఘిక శక్తుల అసలు రూపాలను సమాజానికి తెలియజేస్తూ ఆత్మగౌరవంతో బ్రతకాలని కోరుతూ కడుపునిండా అన్నం దొరకకపోయినా కునుకునిండా నిద్ర సరిపడకపోయినా జర్నలిజం అంటే జర్నలిజం అనే నిజమైన వ్యక్తిత్వాన్ని నిజమైన సామర్థ్యాన్ని నిజాయితీగా నిష్పక్షపాతంగా ఆదర్శవంతంగా నిర్వహిస్తూ ముందుకు సాగాలని అలాంటి నిజమైన జర్నలిజంలో ఎదుర్కొంటున్న నిందలు అవమానాలు అసమానతలు అణిచివేతలు పోరంబోకుల దాడులు కీచకుల కుట్రలు అధికారుల వేధింపులు అన్ని మన నిజాయితీ ముందు వాళ్లకు తలవంపులు తీసుకొచ్చే విధంగా ఉండాలని అలా ఉన్నతమైన జర్నలిజాన్ని కొనసాగించడం కోసం కోట్ల ప్రజల గొంతుకగా ముందుకు సాగాలని ఆశిద్దాం అన్నారు.జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వాలు చేయుత నివ్వాలని జర్నలిస్టుల రక్షణకు న్యాయస్థానాలు ప్రత్యేక చట్టాలను రూపొందించాలని నిజమైన జర్నలిజాన్ని బ్రతికించుకోవడం కోసం జర్నలిజం పాత చట్టాలను కొత్త చట్టాల రూపంలో పదునైన రక్షణను కల్పించడం కోసం నూతన చట్టాల రూపకల్పన జరగాల్సిన అవసరం ఉందన్నారు.జర్నలిస్టులను బూతులు తిట్టాలంటేనే అరాచక శక్తులకు గుండెలు అదిరిపోయే చట్టాలు రూపొందించబడాలన్నారు. అధికార ముసుగులో అహం, పైస బలుపులో మదం,అరాచక శక్తుల రూపంలో కిరాతకాలు అణిచివేయబడాలంటే నిజమైన జర్నలిజం పదునెక్కించబడి నిజాయితీగా నిలబడాలని పిలుపునిచ్చారు.

# ఆ కమిటీపై చర్యలు ఎక్కడ

**మంచాల సదానందంను కాపాడుతున్నది ఎవరు.**
**కమిటీ వేసి రెండు సంవత్సరాలు దాటుతున్న చర్యలు శూన్యం.**
**ఇప్పటికే సదానందంపై చర్యలకు ఈసీ ఆమోదించింది.**
**ప్రభుత్వం పేరు చెప్పి కాలయాపన చేస్తే ఎలా.**
**అకుట్ ప్రెసిడెంట్ కు దగ్గరైతే అవినీతికి తిరుగుండదా.**
**మంచాల సదానందంపై చర్యలకు ఎందుకు ఉపక్రమిస్తున్నారు.**
**కంప్యూటర్ల అవినీతి కనుమరుగైనట్లేనా.**
**కేయూ ఇంజనీరింగ్ వ్యవస్థను నాశనం చేసింది అప్పుడే మర్చిపోయారా.**
**ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న కేయూ ఇంజనీరింగ్ వ్యవస్థ.**

**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:-**


అవినీతిపరులపై చర్యలు తీసుకోవడంలో ఆలస్యానికి బాటలు వేస్తున్న కేయూ ఉన్నత అధికారులు గత రెండు సంవత్సరాల క్రితం ఇంజనీరింగ్ విభాగానికి చెందిన మంచాల సదానందం అనే వ్యక్తిపై కమిటీ వేసి విచారణ చేపట్టి విచారణ నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి అట్టి చర్యలకు ఉపక్రమించడమే కాకుండా కొంతకాలం అధికార హోదాలో కొనసాగించి తదుపరి కాలం చెల్లుబాటైనప్పటికిని ఇంజనీరింగ్ విభాగ డీన్ గా కొనసాగిస్తూ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు సభ్యసమాజానికి అవినీతిపరుల అనుబంధ సన్నిహితులమనే సమాచారాన్ని చేరవేస్తున్నారు. ఏ ప్రభుత్వ ఉన్నత కార్యాలయాల్లో చూసిన అవినీతి కమిటీలు వేయబడినప్పుడు కమిటీకి బాధ్యుడైన వ్యక్తులను అధికార పదవుల్లో కొనసాగించకుండా కమిటీ నివేదికలు పూర్తయి వాస్తవ అవాస్తవాలు నిజనిర్ధారణ జరిగే వరకు పదవుల నుండి తొలగిస్తూ చర్యలు చేపట్టే ఆస్కారాలు ఎక్కువగా ఉంటాయని వాటన్నిటికీ పూర్తి భిన్నంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంతటి అవినీతికి పాల్పడిన, ఎన్ని అక్రమాలకు పాల్పడిన, విశ్వవిద్యాలయ చట్టాలకు ఎన్ని విరుద్ధమైన పనులు చేసిన వాళ్లపై కనీసపు చర్యలు తీసుకోవడానికి సాహసం చేయని అధికారులను ఒక వైపు చూస్తూనే మరోవైపు ఎంతటి అవినీతి అక్రమాలకు పాల్పడిన వాళ్లనే అధికార పదవుల్లో కొనసాగిస్తూ విశ్వవిద్యాలయ పరిపాలనలో పారిభాగస్తులను చేయడం నిజాయితీ కలిగిన అధికారులమని చెప్పుకునే ఉన్నతాధికారులకు మాత్రమే చెల్లుబాటు అవుతున్నట్లుగా కనిపిస్తుంది. కాకతీయ విశ్వవిద్యాలయంలో అకుట్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సభ్యులతోపాటు అందరూ అధికార పదవుల్లో కొనసాగకుండా కేవలం టీచర్ల సమస్యల పరిష్కారం కొరకు అధికారులతో సమావేశాలు నిర్వహింపజేస్తూ టీచర్ల పరిరక్షణ కొరకు పని చేసే విధంగా ముందుకు సాగాల్సి ఉంటుండగా అకుట్ సమూహాన్ని గాలికి వదిలేసిన అధ్యక్షుడు బి.వెంకటరామ్ రెడ్డి తన వ్యక్తిగత స్వార్థాన్ని బలపరుచుకోవడం కోసం ఏకంగా కేయూ పరిపాలనలో ఉన్నత అధికార భాగంలో కూర్చుని టీచర్ల సమస్యలను టీచర్ల మనోభావాలను పూర్తిగా దెబ్బతీస్తున్నాడు. అంతేకాకుండా తన వంతుగా తన బాధ్యతగా అవినీతి అక్రమాలపై స్పందించి మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపట్టే విషయంలో ముందుండి బాధ్యతగా వ్యవహరించాల్సిన వెంకటరామ్ రెడ్డి ఈ మధ్యకాలంలో పలుమార్లు మంచాల సదానందంతో సమావేశమై కేయూ ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్తూ రహస్య పైరవీలు చేస్తుండటమే కాకుండా తన అవినీతిపై తన అక్రమాలపై చర్యలు చేపట్టకుండా ఉండేందుకు తీవ్రమైన ప్రయత్నాలు చేస్తూ సదానందంకు సహకరిస్తున్నాడని విశ్వవిద్యాలయంలో ఉన్నత స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏకంగా పాలకమండలి సమావేశంలో మంచాల సదానందంపై చర్యలు తీసుకోవడానికి కాకతీయ విశ్వవిద్యాలయ అధికారులు వేసిన కమిటీ ఆధారంగా చర్యలు తప్పకుండా తీసుకోవాల్సిందేనంటూ ఈసీలో ఆమోదం తెలిపి విజిలెన్స్ విచారణకు ఆదేశించి దరిదాపుగా 15 నెలలు గడుస్తుండగా ఇప్పటివరకు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం విశ్వవిద్యాలయ సమాజాన్ని తీవ్రమైన అవమాన పరుస్తున్నట్లుగా కనిపిస్తుంది. మంచాల సదానందం ఇంజనీరింగ్ కళాశాలల భవిష్యత్తును ఏ విధంగా నాశనం చూశాడో తన మూడు సంవత్సరాల కాలం పాటుగా రెండు ఇంజనీరింగ్ కళాశాలలో అధికార పదవిలో కొనసాగించిన పరిపాలన విధానాలను, నిధులను దుర్వినియోగపరచిన అంశాలను గుర్తించినప్పుడు చాలా స్పష్టంగా తెలిసిపోతుందన్నది వాస్తవమైన విషయం. ఇవన్నీటిని పరిగణలోకి తీసుకోకుండా ఒకవైపు కాలం చెల్లుబాటైనప్పటికి డీనుగా కొనసాగిస్తూ మరోవైపు అధికార పదవుల్లో కొనసాగించేందుకు వెంకట్రామ్ రెడ్డి హయాంలో జబర్దస్త్ పైరవీ సాగుతుండగా పాలకమండలి సమావేశంలో చర్యల కోసం తీసుకోబడిన నిర్ణయం ఆమోదించబడిన అంశాన్ని పక్కనపెట్టి అటు ప్రభుత్వాన్ని తప్పుతోవపాటిస్తూ ఇటు విశ్వవిద్యాలయాన్ని తప్పుతోవపట్టిస్తూ మరొక్కసారి మోసపూరిత నిర్ణయానికి కట్టుబడి పని చేస్తున్నట్లుగా ఉన్నతాధికారుల వ్యవహార శైలి అవినీతి అక్రమార్కులను కాపాడేవైపు నిలబడుతుందనేది మంచాల సదానందం వ్యవహారంలో స్పష్టంగా కనిపిస్తున్నట్లుగా ఉంది. అవినీతి బయటపడి కమిటీ నివేదికలో తెలిపిన విధంగా పాలకమండలి సమావేశం చర్యలను ఆమోదించి అన్ని విధాలుగా చర్యలకు బాధ్యున్ని చేసి చివరకు పైరవీలకు తొలోగ్గి మంచాల సదానందంను కాపాడాలనుకోవడం పచ్చి అవివేకం లాంటిదని గుర్తించకపోతే నిజ వాస్తవాలు ఆధారంగా మంచాల సదానందంపై చర్యల కొరకు నిరంతర పోరాటంలో భాగంగా వరుస కథనాలతో జై భీమ్ ముందుకు వస్తుందన్న సంగతి పసిగట్టి కేయూ ఉన్నతాధికారులు పాలకమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని సభ్యులు ఆమోదించిన విధంగా తక్షణమే చర్యలు తీసుకొని ఇంజనీరింగ్ వ్యవస్థను కుళ్ళిపోయిన రాజకీయాల్లో నుండి కాపాడాలని కోరనైనది అకుట్ అధ్యక్ష కార్యదర్శులు ఇలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడిన వ్యక్తులను కాపాడే ప్రయత్నంలో భాగంగా అధికారుల వద్దా పైరవీలు కొనసాగించకుండా చర్యలకు మాత్రమే సహకరించాలని లేని పక్షాన వాళ్లపై కూడా క్రమం తప్పకుండా వ్యతిరేక పోరాటాలు చేయాల్సి వస్తుందని గుర్తించాలి. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎవరిని చూసినా పదవుల కోసం పాకులాడడం అవినీతికి పాల్పడడం అక్రమాలు చేయడం విశ్వవిద్యాలయ సొమ్మును దోచుకోవడం ఉన్నతమైన పదవులలో కొనసాగడం సంవత్సరాల కాలంగా కొనసాగుతుందని వాటినన్నింటిని ఏకకాలంలో కట్టడి చేయడం కొరకు పరిపాలన పట్ల అనుభవజ్ఞులైన వీసీ రిజిస్ట్రార్ తక్షణమే కఠినమైన చర్యలు చేపట్టాలని తెలియజేయడమైనది. కంప్యూటర్లకు వెచ్చించిన ఒక కోటి 67 లక్షల సొమ్ము సదానందం అవినీతిని సదానందం అక్రమాలను చాలా స్పష్టంగా బయటపెడుతుంది. తక్షణమే కేయూ ఉన్నతాధికారులు మేల్కొని విజిలెన్స్ కమిటీ విచారణ మంచాల సదానందంపై కఠినమైన చర్యలు చేపట్టాలి.


Executive Council
154th Meeting

Government undertaking), it is observed by the Committee, after going through three reply letters of three engineering colleges, that the then Vice-Chancellor had approved the note files to purchase 100 Computers to each College. It is also noted that the Executive Council resolved to purchase 300 Computers for university departments in view of visit of NAAC only. However, the then Vice-Chancellor given approvals by seeking note files in hasty manner from the Principals of three engineering colleges and purchased the same after completion of NAAC process and without approval of the Executive Council for actual expenditure. Even after the purchase, the matter was not placed before the Executive Council for its ratification for huge expenditure incurred by the then Vice-Chancellor inspite of advises of the authorities concerned. It is also observed that the Engineering Colleges submitted, under compulsion and force, letters for requirement of Computers without specifying configuration. Prof. M. Sadanandam suggested the specifications which was also mentioned in the sanctioned orders issued by the Accounts Sections of the university.

# ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం

**హన్మకొండ, 14 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**




ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో, హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఆదివారం రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో తలసేమియా బాధిత చిన్నారుల కోసం రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెడ్ క్రాస్ జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, ప్రముఖ సంగీత విద్వాంసుడు శ్రీరామ్ కళ్యాణ్, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేసి అవసరంలో ఉన్నవారికి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా తలసేమియా బాధిత చిన్నారులకు నిరంతరం రక్తం అవసరమవుతుందని, సమాజంలోని ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్ కుమార్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), గుల్లెపెల్లి శివ కుమార్‌లను రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు అభినందించారు. ఈ శిబిరంలో రెడ్ క్రాస్ జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, రెడ్ క్రాస్ వైద్యులు డా. జి. కిషన్ రావు, దేవునూరి ఆనంద్, రక్తదాత లోకేష్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిబ్బంది ప్రదీప్ శర్మ, శివకృష్ణ, శంకర్, చిలువేరు శంకర్, యువ నేతాజీ ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్ కుమార్, కానిస్టేబుల్ కన్నె రాజు, గుల్లెపెల్లి శివ కుమార్, కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, ఉప్పరపల్లి రాజ్‌కుమార్, ఊరటి రవికుమార్, అలువాల పృథ్వీ, యాద రవికుమార్, పల్లె రాజిరెడ్డి, రాకేష్, భావన, సునీత, నరేష్, నవీన్, రవికుమార్‌తో పాటు రెడ్ క్రాస్ సిబ్బంది రవీందర్, చరణ్, వినయ్, పోశాలు పాల్గొన్నారు. శిబిరంలో మొత్తం 51 మంది స్వచ్ఛంద రక్తదాతలు రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రక్తదాతలందరికీ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక నిఘా

**28 వాహనాలకు చలానాలు.. 10 ద్విచక్ర వాహనాలు డిటైన్**

**వరంగల్, 14 జూన్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో నెంబర్ ప్లేట్ లేని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ఆదేశాల మేరకు కాజీపేట ట్రాఫిక్ సీఐ వెంకన్న నేతృత్వంలో ఎస్‌ఐలు సంపత్, మంగ, సిబ్బంది కలిసి జూన్ 12, 13 తేదీలలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్‌లు లేని 28 వాహనాలను గుర్తించి సంబంధిత వాహనదారులపై చలానాలు విధించారు. అనంతరం నెంబర్ ప్లేట్‌లు తెప్పించి ఆయా వాహనాలకు అమర్చిన తర్వాతే వాటిని పంపించారు. అలాగే రిజిస్ట్రేషన్ లేని 10 ద్విచక్ర వాహనాలను డిటైన్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు హెచ్చరిక జారీ చేశారు. వరంగల్, కాజీపేట పట్టణ పరిధిలో ఇకపై నెంబర్ ప్లేట్ సరిగా లేకపోయినా, అసలు లేకపోయినా, అలాగే రిజిస్ట్రేషన్ లేకుండా వాహనాలు నడిపినా మోటారు వాహన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అన్ని వాహనదారులు తమ వాహనాలకు నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్‌లు ఏర్పాటు చేసుకోవడంతో పాటు చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండాలని ట్రాఫిక్ అధికారులు సూచించారు.



# కేయూ హాస్టల్ నిధుల కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలి: ఏబీవీపీ




**హన్మకొండ, 14 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం హాస్టల్ నిధుల్లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంతి భవనంలో కేయూ ఏబీవీపీ కార్యదర్శి మేకల జ్ఞానేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద విశ్వవిద్యాలయమైన కాకతీయ యూనివర్సిటీలో రాష్ట్రవ్యాప్తంగా పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు చెల్లించే ఫీజులు, హాస్టల్ నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ హాస్టల్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.పీ. రాజ్‌కుమార్ హయాంలో హాస్టల్ నిర్వహణలో నిబంధనలకు విరుద్ధంగా టెండర్ ప్రక్రియ లేకుండా వ్యవహరించారనే ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ నిధుల వినియోగంపై వెలువడుతున్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారుల బాధ్యతను నిర్ధారించి, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విశ్వవిద్యాలయంలో ఇటీవల కాలంలో వివిధ అంశాలపై అక్రమాలు, అవకతవకల ఆరోపణలు వెలుగులోకి వస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందన తగిన స్థాయిలో లేదని ఆయన విమర్శించారు. యూనివర్సిటీలో పరిపాలన వ్యవస్థ మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. హాస్టల్ నిధుల వ్యవహారంపై ఏసీబీ, విజిలెన్స్ వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలిగించే అంశాలపై చర్యలు తీసుకోకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జూపల్లి దీపిక, కేయూ ఏబీవీపీ ఇన్‌చార్జి డాక్టర్ నిమ్మల రాజేష్, క్రాంతి, హరీష్, చంటి, అజయ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ లోక్ అదాలత్‌లో ట్రాఫిక్ కేసుల పరిష్కారానికి అవకాశం




**హన్మకొండ, 14 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, మైనర్ డ్రైవింగ్ తదితర ట్రాఫిక్ కేసులు ఉన్నవారు నేషనల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కాజీపేట ట్రాఫిక్ పోలీసులు కోరారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు విడుదల చేసిన ప్రకటనలో జూన్ 15 నుంచి 20 వరకు హనుమకొండ 2వ క్లాస్ కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ కేసులను తక్కువ జరిమానాతో పరిష్కరించుకునే అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఉన్నవారు ఆధార్ కార్డు జిరాక్స్, వాహన పత్రాలు తీసుకురావాలని, డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన కేసులు ఉన్నవారు ఆధార్ కార్డు, మీ సేవలో లైసెన్స్ కోసం దరఖాస్తు చేసిన రశీదును సమర్పించాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్ కేసులకు సంబంధించిన వారు జనన ధ్రువీకరణ పత్రం లేదా ఎస్ఎస్‌సీ మెమో తీసుకురావాలని తెలిపారు. అదేవిధంగా 2020 నుంచి 2024 మధ్యకాలంలో డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, పెండింగ్ చలాన్లు లేదా ఇతర కారణాలతో కాజీపేట ట్రాఫిక్ పోలీసులచే స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు ఇంకా పోలీసుల ఆధీనంలో ఉన్నట్లయితే, సంబంధిత పత్రాలతో కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి తమ వాహనాలను తిరిగి పొందవచ్చని పేర్కొన్నారు. కేసులు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలని కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి. వెంకన్న తెలిపారు. అలాగే వాహనాల విడుదలకు సంబంధించి మరిన్ని వివరాల కోసం కోర్టు పీసీ బి. దయాకర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

## మా ఫేస్‌బుక్ పేజీని బ్లాక్ చేశారు... కూటమి ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

వైసీపీ అధినేత జగన్ ఏపీ కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమ పార్టీ అధికారిక ఫేస్‌బుక్ పేజీని భారతదేశంలో కనిపించకుండా చేశారని, ఇది ప్రతిపక్షాల గొంతు నొక్కే చర్యేనని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే కక్షపూరితంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది ప్రారంభంలో తమ పార్టీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తొలగించారని, ఇప్పుడు ఫేస్‌బుక్ పేజీని లక్ష్యంగా చేసుకున్నారని జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. “ఇది కేవలం వైసీపీపై జరిగిన దాడి కాదు. ప్రజాస్వామ్య విలువలు, భావప్రకటనా స్వేచ్ఛపై జరిగిన దాడి” అని ఆయన పేర్కొన్నారు. ఇలా ప్రతిపక్ష పార్టీ అధికారిక ఖాతాలను నిలిపివేయడం ప్రమాదకరమని, ఇది పూర్తిగా అప్రజాస్వామికమని అన్నారు.

# హనుమకొండ జిల్లాకు 8 రాష్ట్ర స్థాయి రక్తదాన అవార్డులు



హన్మకొండ, 14 జూన్ 2026(జై భీమ్ న్యూస్)

ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ ప్రకటించిన రాష్ట్ర స్థాయి రక్తదాన అవార్డుల్లో హనుమకొండ జిల్లా సత్తా చాటింది. స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించడం, రక్తదాన శిబిరాల నిర్వహణ, అత్యధిక రక్త సేకరణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేసినందుకు జిల్లాకు మొత్తం ఎనిమిది రాష్ట్ర స్థాయి అవార్డులు దక్కాయి. హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి, రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు అవార్డులను అందుకున్నారు. హనుమకొండ రెడ్ క్రాస్ రక్తకేంద్రం రాష్ట్రంలో అత్యధిక రక్త సేకరణ చేసిన రక్తకేంద్రాల విభాగంలో ద్వితీయ స్థానం సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. స్వచ్ఛంద రక్తదాన ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో జిల్లా రెడ్ క్రాస్ చేపట్టిన కార్యక్రమాలు ఈ విజయానికి దోహదపడ్డాయి. సంస్థల విభాగంలో ఎస్.ఆర్. యూనివర్శిటీ, కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్), వాగ్దేవి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ రాష్ట్ర స్థాయి అవార్డులను అందుకున్నాయి. విశిష్ట సేవల విభాగంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్, డాఫొడిల్స్ స్కూల్ హనుమకొండ అవార్డులు దక్కించుకోగా, వ్యక్తిగత విభాగంలో అత్యధిక సార్లు స్వచ్ఛంద రక్తదానం చేసిన జి. రామకృష్ణ, బి. శిరీష్ కుమార్ రాష్ట్ర స్థాయి అవార్డులతో సత్కరించబడ్డారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ రక్తదానం మహాదానమని, ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా రక్తదానం చేసి ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రక్త కొరత నివారణకు మరిన్ని రక్తదాన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాకు ఒకేసారి ఎనిమిది రాష్ట్ర స్థాయి అవార్డులు రావడం గర్వకారణమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో ఉన్న హనుమకొండ రెడ్ క్రాస్ రక్తకేంద్రాన్ని త్వరలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ మురళీధర్ భగవత్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, వివిధ జిల్లాల అధికారులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు. హనుమకొండ జిల్లాకు లభించిన ఈ అవార్డులు జిల్లాలోని వేలాది మంది స్వచ్ఛంద రక్తదాతలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవకుల సమిష్టి కృషికి నిదర్శనంగా నిలిచాయి.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిన అంగన్వాడీలకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్!

**వారి స్థానంలో కొత్త నియామకాలు జరగకపోతే తిరిగి విధుల్లోకి అవకాశం**
**అంగన్వాడీల సంక్షేమమే తమ ప్రాధాన్యత అని మంత్రి సీతక్క వెల్లడి**
**వేలాది మంది కార్యకర్తలు, సహాయకులకు లభించిన భరోసా**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమ పదవులకు రాజీనామా సమర్పించి, ఎన్నికల్లో ఓటమి చెందిన అంగన్వాడీ టీచర్లు, సహాయకులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సదరు పోస్టుల్లో ఇప్పటి వరకు కొత్త నియామకాలు జరగని పక్షంలో, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జూన్ 13న అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలనే ఆకాంక్షతో ఉద్యోగాలను సైతం త్యాగం చేసిన అంగన్వాడీ సిబ్బందికి ప్రభుత్వ నిర్ణయం పెద్ద ఊరటనిచ్చింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, సదరు స్థానాలు ఖాళీగా ఉన్న పక్షంలో వారిని తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ నిర్ణయంపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పందిస్తూ, అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేయడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు అందించడంలో అంగన్వాడీల పాత్ర కీలకమని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వం తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35,781 అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తూ, ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలైన వారికి తిరిగి ఉపాధి లభించనుంది. ఇది వారి జీవనోపాధికి భరోసా కల్పించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో అమలవుతున్న పౌష్టికాహార కార్యక్రమాలు నిరంతరాయంగా, సమర్థవంతంగా కొనసాగేందుకు దోహదపడనుంది.



# రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలి: డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.డి. రాంకుమార్

హన్మకొండ, 14 జూన్ 2026(జై భీమ్ న్యూస్)

రక్తదానం యొక్క ప్రాముఖ్యత, ఆవశ్యకతను ప్రజలకు వివరించడం ద్వారా స్వచ్ఛంద రక్తదానానికి మరింత మంది ముందుకు వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.డి. రాంకుమార్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, హనుమకొండ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. అనంతరం బ్లడ్ బ్యాంక్ ఎదుట వైద్య ఆరోగ్య సిబ్బంది, శిక్షణలో ఉన్న విద్యార్థులతో కలిసి రక్తదాతల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంకుమార్ మాట్లాడుతూ, ఈ ఏడాది "మానవత్వం యొక్క ఒక చుక్క -- రక్తదానం చేయండి, ప్రాణాలను కాపాడండి" అనే నినాదంతో ప్రజల్లో రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రక్తదానంపై ఉన్న అపోహలు, అనుమానాలను నివృత్తి చేస్తూ ప్రజలను చైతన్యపరచాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదాతలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరమే రక్త సేకరణ చేపడతామని తెలిపారు. దేశ జనాభాలో కనీసం ఒక శాతం మంది క్రమం తప్పకుండా రక్తదానం చేస్తే రక్త కొరత సమస్య ఉండదని పేర్కొన్నారు.జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు గర్భిణీ స్త్రీల్లో రక్తహీనతను గుర్తించి తగిన ఫాలోఅప్ సేవలు అందించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణీలు, సిజేరియన్ ప్రసవాల సమయంలో రక్తం అత్యంత అవసరమవుతుందని తెలిపారు. అనంతరం బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేసిన వారికి డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.డి. రాంకుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి సర్టిఫికెట్లు అందజేశారు. 49 సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసిన హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి సందెల శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ టి. మదన్‌మోహన్‌రావు, మాతా-శిశు సంక్షేమ కార్యక్రమ అధికారి డాక్టర్ రుబీనా ఆఫ్ రోజ్, బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ నిఖిల, డాక్టర్ అనిల్, డాక్టర్ గీత, డెమో వి. అశోక్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి ఎస్. శ్రీనివాస్, డీపీఓ రుక్ముద్దీన్, డీపీఎంఓ దేవి సింగ్ రవీందర్, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్లు జ్యోతి, శ్రీనివాసరావు, జీఎంహెచ్, పోచమ్మకుంట ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




# మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచింది రేవంత్ రెడ్డే: కేటీఆర్

**మీనాక్షి నటరాజన్‌పై రేవంత్ కుట్ర అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు**
**ఆమెకు రాజ్యసభ సీటు రాకుండా బీజేపీతో రేవంత్ కుమ్మక్కయ్యారని ఆరోపణ**
**కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శలు**
**ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక రావడం ఖాయమని జోస్యం**
**ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపు**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. సొంత పార్టీ నేత, రాహుల్ గాంధీకి సన్నిహితురాలైన మీనాక్షి నటరాజన్‌కు రేవంత్ రెడ్డి వెన్నుపోటు పొడిచారని, ఆమెపై తప్పుడు కేసు బనాయించి వేధించారని విమర్శించారు. ఆమెకు మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ సీటు రాకుండా అడ్డుకునేందుకు బీజేపీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి అవినీతి, భూ ఒప్పందాలపై మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని, దీనికి ప్రతీకారంగానే హైదరాబాద్‌లో ఆమెపై తప్పుడు కేసు పెట్టించారని అన్నారు. సొంత పార్టీ నేతలనే వెన్నుపోటు పొడిచే నైజం రేవంత్ రెడ్డిదని ఆయన దుయ్యబట్టారు. హిట్లర్ తన ఆదర్శం అని సీఎం చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనను 'అట్టర్ ఫ్లాప్ సినిమా'గా అభివర్ణించిన కేటీఆర్, ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, కనీసం 4,000 ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ప్రశ్నించారు. రూ.4,000 నిరుద్యోగ భృతి హామీని కూడా విస్మరించారని మండిపడ్డారు. కోటి మంది మహిళలను లక్షాధికారులను చేశామని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక రావడం ఖాయమని కేటీఆర్ జోస్యం చెప్పారు. ప్రజాతీర్పును ధిక్కరించి దానం నాగేందర్ కాంగ్రెస్‌లోకి ఫిరాయించడమే దీనికి కారణమని స్పష్టం చేశారు. జూన్ 25 నుంచి జరిగే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని, డిజిటల్ సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

# కొత్త మలుపు తీసుకున్న టీఎంసీ తిరుగుబాటు వ్యవహారం!

**టీఎంసీకి షాక్ ఇచ్చిన 20 మంది లోక్‌సభ ఎంపీలు**
**నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీలో తమ వర్గం విలీనం**
**బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు మద్దతు ప్రకటన**
**స్పీకర్ ఓం బిర్లాను కలిసి లేఖ అందజేసిన నేతలు**

ఢిల్లీ, జై భీమ్ న్యూస్



జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పశ్చిమ బెంగాల్ అధికార పక్షం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన 20 మంది లోక్‌సభ సభ్యులు తిరుగుబాటు బాట పట్టారు. వీరంతా నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (చీజ్రూ×)లో విలీనమై, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి మద్దతు ప్రకటించారు. ఈ పరిణామంతో టీఎంసీలో రాజకీయ సంక్షోభం ఒక్కసారిగా ముదిరింది. సీనియర్ నాయకులు కాకోలి ఘోష్ దస్తిదార్, సుదీప్ బంద్యోపాధ్యాయ నేతృత్వంలోని ఈ అసమ్మతి వర్గం నిన్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసింది. ఎన్‌సీపీఐలో తమ విలీనాన్ని గుర్తించాలని కోరుతూ ఆయనకు అధికారిక లేఖను సమర్పించారు. అదేవిధంగా, లోక్‌సభలో తమకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని వారు స్పీకర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. "మేము నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీలో విలీనమవుతున్నాం. ఇకపై ప్రధానమంత్రి నాయకత్వంలోని ఎన్డీఏతో కలిసి దేశాభివృద్ధి కోసం పనిచేస్తాం" అని సమావేశం అనంతరం కాకోలి ఘోష్ దస్తిదార్ మీడియాకు వెల్లడించారు. లోక్‌సభలో టీఎంసీకి ఉన్న మొత్తం బలంలో తమది మూడింట రెండొంతుల కంటే ఎక్కువ ప్రాతినిధ్యమని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఈ పరిణామాలపై టీఎంసీ అధిష్టానం తీవ్రంగా స్పందించింది. నిబంధనల మేరకు ఈ తిరుగుబాటు వర్గాన్ని గుర్తించవద్దని ఆ పార్టీ అగ్రనేత అభిషేక్ బెనర్జీ స్పీకర్‌ను కోరినట్లు సమాచారం.

# ప్రతిభ గల పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందజేసిన విజయ్ దేవరకొండ

**సొంతూరుకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న హీరో విజయ్ దేవరకొండ**
**180 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్**
**విజయ్ దేవరకొండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాల పంపిణీ**
**కార్యక్రమంలో పాల్గొన్న రష్మిక మందన్న, ఎమ్మెల్యే వంశీకృష్ణ**
**తెలంగాణ వ్యాప్తంగా విస్తరించడమే తన కల అని చెప్పిన విజయ్**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ తన సొంతూరికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన 'ది దేవరకొండ ఫౌండేషన్' ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట డివిజన్‌లోని 45 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 180 మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేశారు. 9, 10వ తరగతుల్లో ఫస్ట్, సెకండ్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ ఉపకార వేతనాలు అందించారు. ఈ కార్యక్రమానికి విజయ్ దేవరకొండతో పాటు ఆయన అర్ధాంగి, నటి రష్మిక మందన్న, తల్లి మాధవి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, జిల్లా విద్యాధికారి రమేష్ తదితరులు హాజరయ్యారు. ఇటీవల తన వివాహం అనంతరం సొంత గ్రామమైన తుమ్మన్‌పేటలో ఏర్పాటు చేసిన రిసెప్షన్‌లో విజయ్ ఈ హామీ ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారం ఈ కార్యక్రమాన్ని చేపట్టడంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, "ఎంత ఎత్తుకు ఎదిగినా విజయ్ దేవరకొండ తన సొంత ఊరును మర్చిపోకపోవడం ఆయన గొప్ప వ్యక్తిత్వానికి నిదర్శనం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయం. ఈ కార్యక్రమాన్ని ఏటా కొనసాగిస్తామని చెప్పడం సంతోషకరం" అని అన్నారు. విజయ్ ఇండస్ట్రీలో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. రష్మిక మందన్న మాట్లాడుతూ, "ది దేవరకొండ ఫౌండేషన్ ద్వారా మంచి పని చేయాలనుకున్నప్పుడు, మొదట మామయ్య పుట్టిన ఊరి నుంచే ప్రారంభించాలని నిర్ణయించుకున్నాం. మీరంతా కష్టపడి చదివి మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడేలా చేశారు. జీవితంలో గెలుపోటములు సహజం, కానీ నిరంతరం నేర్చుకుంటూ ముందుకు సాగాలి. తల్లిదండ్రులను, గురువులను గౌరవించి గొప్ప స్థాయికి ఎదగాలి" అని విద్యార్థులకు సూచించారు. విజయ్ దేవరకొండ తల్లి మాధవి మాట్లాడుతూ, "పిల్లల ఫీజులు చెల్లించడం ఎంత కష్టమో మాకు తెలుసు. పిల్లలు తమ తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకోవాలి. అదే సమయంలో, తల్లిదండ్రులు కూడా పిల్లల కలలను నిజం చేసేందుకు ప్రోత్సహించాలి. డ్యూటీ, డిసిప్లెయిన్, డివోషన్, డెడికేషన్, డిటెర్మినేషన్ అనే ఐదు 'డి'లు పాటిస్తే జీవితంలో విజయం తథ్యం" అని పేర్కొన్నారు. అనంతరం విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. "మీ విజయాన్ని సెలబ్రేట్ చేయడానికే ఈ కార్యక్రమం చేపట్టాం. మార్కుల కన్నా, వాటిని సాధించడానికి మీరు పడిన శ్రమ, ఏకాగ్రత చాలా గొప్పవి. జీవితంలో ఫోకస్, క్రమశిక్షణ ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చు. నేను, రష్మిక మా స్టూడెంట్ లైఫ్‌లో ర్యాంకర్స్ కాదు. కానీ మీ విజయాన్ని చూసి గర్వపడుతున్నాం. ఈసారి ఫలితాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలవడం ఆనందంగా ఉంది. ఈ ఘనత ఉపాధ్యాయులదే" అని అన్నారు. "మా తల్లిదండ్రులు ఈ ఊరితో పెంచుకున్న అనుబంధం వల్లే నేను ఈ కార్యక్రమం చేయగలుగుతున్నాను. ఇప్పుడు అచ్చంపేటలో ప్రారంభించాం. భవిష్యత్తులో నాగర్‌కర్నూల్ జిల్లా, ఆ తర్వాత తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించాలనేది నా కల. ఈ ఉపకార వేతనాలు నిజమైన అర్హులకు మాత్రమే చేరేలా చూడాలని విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను కోరుతున్నాను. ఇది దుర్వినియోగం అయితే నేను చాలా బాధపడతా" అని స్పష్టం చేశారు. కొత్త విద్యా సంవత్సరాన్ని ప్రారంభిస్తున్న విద్యార్థులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

